# సగటు మనిషి

బ్యాంక్ సావనీర్ - 1977

"మనం ఐశ్వర్యవంతులం కాలేదని బాధపడితే అర్థం వుంది.
మనతోటివాడు ధనవంతుడైనందుకు బాధపడితే అది అసూయ అవుతుంది."

ఎక్కడికి మాష్టారూ!

ఆ రోజు జీతాలందుకుని, అప్పటికప్పుడే తోటి ఉపాధ్యాయునికి, దోవలో కనపడ్డ అప్పులవాళ్ళకి ఇవ్వగా మిగిలిన చిల్లరనోట్లను జేబులో కుక్కుకొని నడుస్తున్న మాష్టారు నడివీధిలో ఆగిపోయారు. నడివీధిలో వేపచెట్టుక్రింద బండరాతి మీదనున్న ఓ ఆశ, ఓ ప్రలోభం, ఓ ఆకర్షణ అతనిని అక్కడే నిలిపేసింది. దాని వైపు ఒక్కడుగేసిన మాష్టారుని అసహాయత, బాధ్యత గుడ్లురిమి హెచ్చరించి రెండడుగులు వెనక్కు నడిపింది. అలా ఒక ఘడియసేపు తచ్చాడిన మాష్టారుని ప్రలోభమే గెల్చుకుంది. గబగబ ముందుకు నడిచారాయన.

అది మారుమూల ఒక చిన్న పల్లెటూరు. నాగరికతకు దూరంగావున్న ఆ పల్లెటూరిని కూడ లాటరీ దయ్యం పట్టుకుంది. ఏజెంటు సుందరరావు రూపంలో రచ్చబండమీద ఎక్కి, కూర్చుంది. తమాషా ఏమంటే ఆ దయ్యాన్ని చూచి ప్రజలు విపరీతంగా అకర్షింపబడుతున్నారు.

"రండి మాష్టారూ!" సవినయంగా ఆహ్వానించాడు ఏజంటు సుందరరావు. అతనెక్కడివాడో కాదు, ఆ ఊరిలో ఎక్కువగా చదువుకున్న యస్.యస్.యల్.సి. కుర్రాడు, బ్రతకనేర్చినవాడు. తన పుట్టిన ఊరిని ఉద్ధరించే నిమిత్తం ఈ బృహత్కార్యానికి కంకణం కట్టుకున్నానని చెప్తూ వుంటాడు.

ఇన్ని నెలలుగా లాటరీ తీస్తున్నారుగాని ఆ వూరి వారిలో ఎవరికీ యింకా మోక్షం రాలేదు.

"ఏమిటోయ్ సుందర్రావ్! వ్యాపారమెలాగుంది?" తన మనసులో కోరికను ఒక్క క్షణం ప్రక్కనపెట్టి సుందరరావును పరామర్శించారు మాష్టారు.

"వ్యాపారానికేముంది మాష్టారూ. మీలాంటి వాళ్ళంతా నా చెయ్యి చలవవల్ల చల్లగా బ్రతకాలిగాని."

మాష్టారుగా పిలవబడుతున్న ఆయన ఆ ఊరు ఎలిమెంటరీ స్కూలుకు హెడ్ మాష్టరు. ఆయన పేరు సదానందం. కానీ ఆయన మనసారా నవ్వగా ఎవ్వరూ చూసిన దాఖలాలు లేవు. ఆయన నవ్వకూడదని భీష్మించుక కూర్చోలేదు. నడివయసు దాటి నడుము వంగిపోయినా, ఆయనకు మిగిలిన ఆస్థి నలుగురు ఆడపిల్లలు, ఆ తర్వాత యిద్దరు మగ నలుసులు.

"ఏమిటి మాష్టారూ! ఆలోచిస్తున్నారు. రాధమ్మచెల్లి పేరుమీద టిక్కెట్టు కొనేయండి లక్ష్మీదేవి మిమ్మల్ని వరించకపోతే నన్నడగండి."

మాష్టారులో ఆశ చిగురించింది. మొగ్గలువేసి పువ్వులు పూయడం ప్రారంభించింది.

అటూ యిటూ చూసి మెల్లిగా అన్నారాయన.

"నిజంగా వస్తుందంటావా సుందర్రావ్!"

"ఏమిటి మాష్టారూ మీ సందేహం? ఏదో ఒక ప్రైజ్ తగలకపోతే చూడండి. నేను మంచి మనస్సుతో యిస్తున్నాను తీసుకోండి" సుందరరావు టిక్కెట్టును ఉదార బుద్ధితో రూపాయి తీసుకుని దానం చెయ్యబోతున్నాడు. మాష్టారు జాగ్రదావస్థలో కలలు కంటున్నారు.

ఐదు లక్షలు.... పోనీ ఓ లక్ష.... అందరమ్మాయిలకు ఒకేమారు పెళ్ళిళ్ళు చేసేయొచ్చు. కొడుకుల్ని ఒక డిగ్రీవరకైనా చదివించొచ్చు పాపం పిచ్చిశాంతకు మొదట ఒక జత నల్లపూసల గొలుసు, బంగారు గాజులు చేయించాలి. ఎప్పుడో పది సంవత్సరాల క్రితం అడిగి అడిగి మానుకుంది. తను కూడా ఒక పంచెల జత కొనుక్కుంటే బాగుంటుంది. తనకున్న జత మరీ పాతదయిపోయింది. ఇంటి ఆడబడుచుల విషయం యీ దరిద్రంలో మర్చేపోయాడు. వాళ్ళను పిల్చి పసుపు కుంకుమపెట్టి పంపించాలి.

"ఏమిటి మాష్టారూ! దీనికింత ఆలోచన. రాధమ్మ చెల్లి అదృష్టంమీద నాకు గట్టి నమ్మకం వుంది, మరి ఆలోచించకండి."

కథా నిలయం
5346



ఒక్క రూపాయికి ఇంత సులువైన మార్గంలో తన సమస్యలన్నీ పరిష్కార మవుతున్నప్పుడు తను లేరి కూర్చొని బీదరుపులు అరవడం ఏమీ బాగా లేదనిపించిందా యనకు.

"ఒక్కటివ్వవోయ్" అన్నాడు స్థిరంగా.

"ఏ నంబరు కావాలో తీసుకోండి సార్" అన్నాడు ఉత్సాహంగా లాటరీ టిక్కెట్లను ఫేన్‌లా పేర్చి.

మాష్టారు చెయ్యి ముందుకొచ్చింది, మనస్సు వెనక్కు లాగుతోంది. 'ఒకవేళ... ఒకవేళ రాకపోతే ఒక్క రూపాయి అంటే అర కిలో బియ్యం, 4 పూటల కూరలు... యింట్లో నలుగురాడ పిల్లలకు చేతికి గాజులు లేదా జడలోకి వారం రోజుల మల్లె పూలు'.... అతని చేతులు వణికాయి.

'ఛీ... ఛీ పాడు మనస్సు ఎప్పుడూ వున్న గొడవలే.... ఎప్పుడూ తీరని కోరికలే.' బాధ్యతను ఆశ గెల్చుకుంది. యీమారు చెయ్యి ధైర్యంగా ముందుకెళ్ళింది. ఒక కాగితాన్ని పట్టుకుని లాగితే రెండు కాగితాలు వచ్చాయి. ఒకదాన్ని తిరిగి యిచ్చేయాలను కున్నాడు. కానీ 'దేన్నివ్వాలి? ఇచ్చేసినదానికి ప్రైజ్ వస్తే?.....'

"ఇవ్వనా మాష్టారూ!"

"నాకు ఒక్కటి చాలోయ్"

"సరే ఏ టిక్కెటివ్వమంటారు?"

పైనున్న టిక్కెట్టును తిరిగి యివ్వబోయారు మాష్టారు... చేతులు సన్నగా వణికాయి. 'ఆ టిక్కెట్టుకు ప్రైజ్‌వచ్చి తనని దురదృష్టవంతుణ్ణి చేస్తుందేమో....'

"వద్దు... వద్దు మాష్టారూ! యివ్వకండి అదీ వుంచండి. దానికే ప్రైజ్ వస్తే మరల బాధపడాల్సి వస్తుంది."

ఆ రెండు టిక్కెట్లేగాక అతని చేతిలో యింకా చాలా టిక్కెట్లు వున్నాయని వాళ్ళిద్దర్లో ఒక్కరికీ గుర్తు రాలేదు. గుర్తు వచ్చినా సుందరరావు, ఆ విషయం చెప్పి ఆ మాష్టార్ని బాధించదల్చుకోలేదు. అతని మానవత్వం అలాంటిది. ఆ బీదమాష్టారు రెండు రూపాయిలకంటే ఎక్కువ ఖర్చు పెట్టలేడని సుందరరావుకు బాగా తెల్సు.

"వెళ్ళండి మాష్టారూ! వచ్చే నెల యీవరకు మీరు లక్షలకు అధిపతి అయి పోతారు... గుర్తుంచుకోండి మాష్టారూ నన్ను."

సుందర్రావ్ ఇస్తున్న భరోసా తాలూకు మత్తులో మొదట మాష్టారుకు తెలియ లేదుగాని ఆ మత్తు దిగేకొలదీ అతనికి తను ఖర్చుపెట్టిన రెండు రూపాయలు ఎంత

విలువయినవో ఆకలితో నకనకలాడే తన పేగులకు అవెంత అవసరమో అతనికి బోధపడసాగింది. అతను తను చేసిన తెలివితక్కువ పనిని ఎవరికీ చెప్పదల్చుకోలేదు. కాని తన బాధను, అసంతృప్తిని, ఆశను తన అర్థాంగితో పంచుకోకుండా వుండలేక పోయాడు.... ఆ రాత్రి తన భర్త సముఖంలో జరిగిన సంగతి తెల్సుకున్న శాంత "మన కంత అదృష్టమెక్కడిది? రెండు రూపాయలు నష్టపోవడం తప్ప" అని తన నిరాశావాదాన్ని వెల్లడి చేసింది.

యధావిధిగా పదవ తారీకుకల్లా జీతం అయిపోయింది. మరో పది రోజులు మామూలు ప్రకారం అప్పులతో బండి లాక్కొచ్చారు. మిగతా పదిరోజులే మాష్టారుగారికి గడ్డు రోజులు. నెలాఖరులో తన అరుగుమీద బిచ్చగాడు తినే నాలుగురకాల మెతుకుల వంక ఆశగా చూచే పసివాళ్ళను చూసినప్పుడు ఆ భార్యాభర్తలకు ఆత్మహత్య చేసు కోవాలనిపిస్తుంది. ఆ యిరవై రెండవ తారీఖున అలా కాళ్ళీడ్చుకుంటూ మండు టెండలో నడచిపోతున్న మాష్టారుకి తన జేబులోవున్న రెండు టిక్కెట్లు చాల బరువుగా మోయ లేనంత భారంగా వున్నాయి. ఆ రెండు రూపాయల విలువ భూతద్దం వెనుక చేరి అతన్ని వెక్కిరిస్తోంది. నాలుగు పూటల... నాలుగు మెతుకులకు దూరం చేసిన ఆ టిక్కెట్లు అతని గుండెకు పాముల్లాగా మెత్తగా తగులుతున్నాయి. తాను చేసిన అవివేకపు పని చంటివాడి ఏడుపు రూపంలో వెక్కిరిస్తోంది.

ఎదురుగుండా చలపతి మాష్టారు వడివడిగా వస్తున్నారు. అతన్ని చూడగానే సదానందం మాష్టారి కళ్ళల్లో ఆశ తలుక్కుమంది. క్షణం అభిమానం అడ్డు వచ్చింది. చలపతి ఆ స్కూల్లోనే రెండవ మాష్టారు. ఇప్పటికే అతని దగ్గర ఐదు రూపాయలు అప్పు తీసుకున్నాడు. 'మరల అడగడం ఎలా?' అతను దగ్గరకొచ్చేస్తున్నాడు. అడగాలి. ఏమైనా అడిగేయాలి. కాదన్నా సరే అడిగేయాలి. ఛీ కొట్టినాసరే అడిగేయాలి. బాధ పడకూడదు. అలా నిశ్చయించుకొన్న సదానందం మాష్టారి ధైర్యం, చలపతి మాష్టారు కనపడగానే సన్నగిల్లింది. 'రెండు రూపాయలుంటే సర్దగలవా?' అని అడగాలని తెరచిన అతని నోరు

"ఎక్కడికోయ్! అంత హడావుడిగా వెళుతున్నావ్" అని అడిగింది.

"ఏం లేదండీ! ఓ రెండు లాటరీ టిక్కెట్లు పట్టుకురమ్మని మా ఆవిడ గొణుగు తుంటేనూ, సుందర్రావ్ ప్రక్కవూరుకి వెళ్ళిపోతాడేమోననీ..." నసిగాడు.

హఠాత్తుగా లాటరీలో లక్షరూపాయలు వచ్చినంత సంతోషమేసింది సదానందం మాష్టారుకి. తన జేబులో వున్న లాటరీ టిక్కెట్లు తడుముకున్నాడు. అవి అక్కడే చలనం లేకుండా సురక్షితంగా వున్నాయి. అతని నోరు యీ మారు అనాలనుకున్న మాటను అనేసింది.

"మొన్న ఎవరో అమ్మిపెట్టమని నా చేతికి కొన్ని టిక్కెట్లు యిచ్చారోయ్. అందులో రెండు మిగిలాయి తీసుకుంటావా?" అలా అనేసిన తర్వాత ఆయనకు పెద్ద సందేహం వచ్చింది. 'కొంపదీసి టిక్కెట్లు తీసుకొని అప్పు తాలూకా ఐదు రూపాయల్లో చెల్లుపెట్టు కోమనడు గదా!' ఆయన బాధల్ని, భయాల్ని అవతలకు నెడుతూ కాస్త పెద్దగా నవ్వుతూ అన్నాడు చలపతి.

"ఇవ్వండి మాష్టారూ మీ చేయి చలవ చూస్తాను."

గుండెలనిండా ఊపిరి పీల్చుకుంటూ రెండు టిక్కెట్లు చలపతి చేతిలో పెట్టేశాడు. చలపతి మాట్లాడకుండా రెండు రూపాయలిచ్చేసి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. ఆ రెండు రూపాయల నోటును అతి జాగ్రత్తగా గుప్పెట్లో ముడుచుకుని బియ్యం షాపు వైపు నడిచాడాయన.

* * * * *

"ఈ శుభవార్త విన్నారా మాష్టారూ!" ప్రక్కింటి పరశురామ్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిటి?" అన్నట్లు కళ్ళజోడులోనుండి చూస్తూ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోమని సంజ్ఞ చేశాడు.

అతను తీరిగ్గా కూర్చుంటూ అన్నాడు.

"సుందర్రావు అన్నట్టు మన వూరికి అదృష్టం పట్టే రోజులొస్తున్నాయి."

భర్తకు కాఫీ ఇద్దామని వచ్చిన శాంత ప్రక్కింటి పరుశురామ్‌ను చూచి గతుక్కు మంది. రెండు రోజులుగా కాఫీలేక తలనొప్పితో బాధపడుతున్న భర్త అవస్థ చూడలేక పక్కింటి మహలక్ష్మమ్మ దగ్గర అరువు తెచ్చుకొన్న చిటికెడు కాఫీ పొడితో కాసిన కప్పుడు కాఫీ అది.

"రండి అక్కయ్యా! మీకో శుభవార్త చెప్తాను" పరుశురామ్ అలా పిలవడంతో వెనక్కి వెళ్ళడానికికూడా ఆమెకు అవకాశం లేకపోయింది. బలవంతంగా చిరునవ్వును కాఫీపొడిలాగే అరువు తెచ్చుకొని, చేతిలోని కాఫీని మనస్సుకు వ్యతిరేకంగా అతనికి అందించింది.

కప్పు అందుకుని "మీరు మాష్టారూ!" అన్నాడు మర్యాదకోసం.

"నా కాఫీ అయిపోయింది. నువ్వు కానీ" పైకి నవ్వుతూ అన్నా మనస్సునిండా నీరసం వచ్చేసింది అతనికి.

భర్తను తలచుకొని శాంత కళ్ళు ఆర్ద్రమయ్యాయి.

తీరిగ్గా కాఫీ త్రాగి మొదలెట్టాడు పరుశురామ్.

"మీ చలపతి మాష్టారుకి థర్డ్ ప్రైజ్ వచ్చిందట మద్రాసు లాటరీలో"

అంతవరకు యధాలాపంగా వింటున్న మాష్టారి పంచేంద్రియాలు ఆ మాటలతో ముద్దకట్టుకుపోయాయి.

"మొత్తానికి చలపతి అదృష్టవంతుడు మాష్టారూ. పిల్లాపాప లేరు. ఉండేది భార్యాభర్తే. ఇప్పుడే పూలరంగడిలా తిరుగుతుంటాడు. ఇంక దశ తిరిగిపోయిందనుకోండి. మరలా మీకు క్రొత్త మాష్టారు రావాల్సిందే. లక్షలకధికారి... ఇంకా మాష్టారు ఉద్యోగం చేస్తాడంటారా?" పరుశురామ్ సగం ఉత్సాహంతో, సగం మాత్సర్యంతోనూ చెప్పుకు పోతున్నాడు. సదానందం మాష్టారు అదేం వినడంలేదు.

కొన్ని లక్షలు, కొన్ని వేలు..... ప్రైజు ఎంతో తెలియదు. ఎంతయితేనేం తనకు రావాల్సిన ప్రైజు అది. తన అసమర్థతతో, పనికిరాని అభిమానంతో అవివేకంగా పారవేసు కున్న అదృష్టం అది. తనకు కాళ్ళు కడిగి వరించాల్సిన అఖండమైన సిరి అది.

మెడలో మెరిసే మాంగల్యంతో పచ్చటి పాదాల పారాణితో నునుసిగ్గుతో నలుగురు కూతుళ్ళు తలలు వంచుకొని తమ కాళ్ళకు నమస్కరిస్తున్నట్టు తన కళ్ళ ముందు మెరిసి చిన్నాభిన్నం అయిపోయింది.

తన కొడుకులు పెద్ద ఆఫీసర్లయి ఒక సిటీలో తలా ఒక బంగళాలో వుంటే తను వెళ్ళి అప్పుడప్పుడు చూచే దృశ్యం క్రూరంగా వెక్కిరిస్తోంది.

'ఎంత అవివేకం ఎంత అవివేకం!' మనస్సులోనే తనను కసితీరా తిట్టుకున్నా రాయన.

ఆ రోజు చలపతి కనపడకుండా వుండి వుంటే ఎంత బాగుండేది! కన్పించినా తన జేబులో టిక్కెట్లు లేకపోతే ఎంత బాగుండేది! అతన్ని కలుసుకున్న ఆకలి క్షణాలు ఎంత దరిద్రమయినవి!!

పట్టుచీరలో ఒంటినిండా నగలతో భర్త ప్రక్కనే కార్లో వెళుతున్న చలపతి భార్య అతని తల చుట్టూ తిరిగి అతన్ని మరీ పిచ్చివాడ్ని చేస్తోంది.

మరలా ఒక్కమారు ఆ దరిద్రపు క్షణాల్ని దాటి వెళ్ళి తన టిక్కెట్టును తాను భద్రంగా దాచుకోవాలనిపిస్తోంది. జరగనిదేదో జరగాలనీ ఆశ... కాలం వెనక్కు తిరిగితే ఎంత బాగుణ్ణు... అనే ప్రలోభం.

"ఏమిటో.... మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు. నేను వెళతాను మాష్టారూ!"

ఉలిక్కిపడ్డాడు సదానందం మాష్టారు. తన మనస్సులో అసూయను, మాత్సర్యాన్ని ఇతరులు తెల్సుకోగూడదు, మాష్టారు మంచివాడనే బిరుదు తనకు యెల్ల కాలం కావాలి.

"లేదు.... లేదు. కూర్చోండి. మా చలపతికి ప్రైజు వచ్చిందంటే చాల సంతోషంగా వుంది. వెళ్ళి చలపతిని అభినందించి రావాలి" కండువా దులుపుకొని లేచారు. ఆ పరిస్థితుల్లో మరో రెండు నిమిషాలు పరుశురామ్‌కు ఎదురుగా కూర్చుంటే తన మనస్సులోని మాత్సర్యం బయటపడిపోవచ్చు.

పరుశురామ్ వెళ్ళిపోవడంతో మరలా అక్కడే చతికిలబడ్డాడు.

విషయం అర్థం చేసుకుంది శాంత.

టిక్కెట్టు కొన్నరోజు 'మనకు అంత అదృష్టమెక్కడిది? రెండు రూపాయలు ఖర్చు తప్ప!' అని తన నిరాశావాదాన్ని వెల్లడించిన శాంత ఈ రోజు 'రెండు పూటలు... వెధవ కడుపులు నింపుకోడానికి అదృష్టాన్ని కాలదన్నుకున్నాము" అంది బాధగా. వెంటనే "పోనీలెండి మనకింతే ప్రాప్తం. మీరు బాధపడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు" అని లోపలికెళ్ళింది.

నిజానికి చలపతి యింటికి వెళ్ళాలనిలేదు. వెలిగే చలపతి ముఖాన్ని చూసి తను ఓర్చుకోలేడని తనకు తెల్సు. కాని వెళ్ళాలి. సదానందం మాష్టారు అసూయాపరుడు కాదని లోకాన్ని నమ్మించడానికైనా వెళ్ళాలి. అసూయ కేన్సరు లాంటిది. తొందర తొందరగా శరీరంలో ప్రతి భాగాన్ని ఆక్రమిస్తుంది. దీన్నుండి తప్పించుకోవాలి. ఎలాగైనా తప్పించుకోవాలి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

* * * * *

ఆ సాయంత్రం కాళ్ళీడ్చుకుంటూ చలపతి ఇంటికి వెళ్ళాడు. వరండాలోనే కూర్చుని వున్న చలపతి మాష్టారు నిండుగా నవ్వుతూ ఆహ్వానించాడు. వ్యతిరేకించే మనస్సును జోకొట్టి మాట పెగుల్చుకొని అన్నాడు సదానందం మాష్టారు.

"చాలా సంతోషమోయ్ చలపతీ!"

"దేనికి మాష్టారూ!"

ప్రైజు వచ్చినంత సంతోషంగా లేని అతని ముఖం చూస్తుంటే ఒళ్ళు మండింది సదానందం మాష్టారుకు.

'ఇడియట్!... వాడికి ప్రైజు వచ్చిందంటే నేను కుళ్ళుకుంటానని కాబోలు చెప్ప కుండా దాస్తున్నాడు ఏమైనాసరే! తనకేమీ అసూయ లేనట్లు, అదృష్టం తెచ్చిచ్చే ఆ డబ్బంటే లెక్కలేనట్టు వుండాలి' మనస్సులోనే గట్టిగా అనుకున్నాడు. తన ఊహల్ని సంస్కారం పొర వెనుక దాచేస్తూ అన్నాడు.

"నీకు ప్రైజు వచ్చిందంటే నా కొచ్చినంత సంబరంగా వుందోయ్ చలపతీ!"

"ఏం ప్రైజు మాష్టారు?" అయోమయగా చూస్తున్న చలపతిని చూస్తే అరికాలి మంట నెత్తికెక్కింది. 'రాస్కెల్! తను టిక్కెట్టిచ్చాను కదాని బేరాలాడి బ్రతిమిలాడడానికి వచ్చానని కాబోలు దాస్తున్నాడు.

"అదేనోయ్! లాటరీలో ప్రైజు"

"ఓ అదా! చంపేశారు పొండి మాష్టారూ!" గొల్లున నవ్వాడు చలపతి. "మీకు పరశురామ్ చెప్పాడా? ప్రొద్దున డ్రా రిజల్ట్సు వచ్చాయంటే పేపర్ తెప్పించి చూస్తున్నాను. పరశురామ్, రఘునాథ్ రంగారావు వచ్చారు. నంబర్లు చూస్తున్నప్పుడు కళ్ళు బైర్లు కమ్మాయి. సరిగ్గా మీరిచ్చిన టిక్కెట్టు నంబరున్నట్లే అనిపించింది. దానిని టాం... టాం... చెయ్యడానికి కాబోలు పరశురామ్ అప్పుడే పరుగెట్టాడు. నేను, రంగారావు తీరిగ్గా చూస్తే ఆ నంబరు కాదు. ఒకటిని ఏడుగా పొరపడ్డాం" అని యింకా నవ్వుతూనే...

"ఏడు అంకె భలే ముంచింది మాష్టారూ!" అన్నాడు.

ఒక్క నిముషం తర్వాత సదానందం మాష్టారుకి తన సమస్యకు పరిష్కారం దొరికినట్లు.... తనకింక సమస్యలే లేనట్లు.... ఇంతవరకు ఎంతో భారంగా వున్న హృదయం ఒక్కమారుగా తేలికపడినట్లు చాల ప్రశాంతంగా వుందనిపించింది. దానికి కారణం కూడా అంతరాత్మ అట్టడుగున ఆయనకు బాగా తెలుసు. కానీ ఆ విషయాన్ని మనస్సులో సైతం నమ్మడానికి అయన సిగ్గుపడుతున్నాడు.

తను లాటరీ టిక్కెట్టు కొనాలనుకున్నప్పటినుండి తను అనుభవించిన విచిత్ర మైన సంఘర్షణలను తల్చుకొని యీనాటికి అవి తీరిపోయినందుకు గుండెలనిండా గాలి పీల్చుకున్నారాయన.

"అరెః చాలా దురదృష్టం చలపతీ!"

తన అదృష్టం వెంట్రుకవాసిలో ఏడు అంకెలో అన్యాయంగా జారిపోయి నందుకు చలపతి మనస్సులో ఏం బాధపడ్డాడోగాని పైకి మాత్రం నవ్వేస్తూ అన్నాడు.

"అంతా మన ఆశ మాష్టారూ!"

* * * * *

తన గుడిశతోపాటు మరో గుడిశకూడా మేడగా మారితే కుళ్ళుకునేవాడు నీచుడు. తన గుడిశ అలా నిశ్చలంగా ఉండగానే ప్రక్కవాడి గుడిశ ఆకాశాన్నంటితే కూడా మనస్ఫూర్తిగా చిరునవ్వుతో చూడగలిగినవాడు త్యాగి. తను ఒక్క అడుగైనా వెయ్యకుండానే తోటివాడు కోటీశ్వరుడైతే బాధపడేవాడు సామాన్య మానవుడు. అందుకే యిందులో సదానందం మాష్టారి దోషం వీసమెత్తులేదు. అతను రక్త మాంసాలున్న సామాన్య మానవుడు. అతను సగటు మనిషి.

కథా నిలయం
5346
శ్రీకాకుళం